# అటునుండి యిటు

* వేదం విశ్వనాథం *

...పన్న ఔదార్యములో దానకర్ణుడని స్త్రీలకు లొంగని మగధీరుడనిన్నీ తన్ను జనులు కొనియాడవలెనని పాటుపడుచుండేవాడు. తన ఉదార స్వభావాన్ని వెల్లడిచేయుటకు తరచుగా పాపన్న అందరితో పదేపదే యీ విధముగా చెప్తుండేవాడు: "అయ్యా నాతో సమానంగా దానధర్మాలు చేసేదెవరండి. చెప్తాను వినండి, ఈ కష్టకాలంలో ఎన్నో తంటాలుపడినా భార్యబిడ్డలను నేనే పోషించానండీ, మరెవరు కాదండీ, నేనే పోషించానండీ, ఇంత పెద్దవూరిలో మరెవరున్నా వారిని పోషించలేదండీ, అందుకు వారికి లవలేశమైనా కృతజ్ఞతున్నదనుకున్నారా, సరేమిరా, లేనేలేదండీ-కృతఘ్నులండీ, కృతఘ్నులు- పందికొక్కులవలె తిని నన్నే తూలనాడుతారు."

రెండవ విషయము: సన్యాసులవలె ఇతనికి శాశ్వత వ్యసనముకింద తెలియని జనులు తన్ను కూడ భార్యకు లొంగే మనిషి అనుకొంటారేమో అనే భయము మాత్రము సదా పీడించుచుండెను. జనుల కిటువంటి యభిప్రాయము కలుగకుండుటకు సదా స్త్రీలోలురను హేళనముగా సాధించేవాడు. స్త్రీలమాట వినేవారంతటి అధమాధములు మనస్తత్వము ప్రపంచములో లేరట. వారికి పేరు స్త్రీబానిసలు, స్త్రీదాసులట.

ఈ సందర్భములో మహమ్మదీయులను పాపన్న చాల మెచ్చుకునేవాడు - హిందువులందరు స్త్రీబానిసలట. మహమ్మదీయులు మాత్రము కారట. మహమ్మదీయులు మగధీరులట - వారు స్త్రీలను తగిన అదుపులో పెట్టి బయటికికూడ రానీయరట, పాపన్న యీ అంశముపైన కనపడ్డవారికల్లా లెక్చరిస్తుండేవాడు. ఒకదినము రామారావనే అయనొకడు పాపన్నను తీవ్రముగ ఖండించాడు:

"పాపన్నగారూ, ఎవరయ్యా మీకు మహమ్మదీయులు మగధీరులని చెప్పింది. వారును మనవంటివారే, స్త్రీవిషయములో మగవారందరొకటే, మహమ్మదీయులుండే వీధికొచ్చి చూడండి - బీబీని లోపల కూర్చోపెట్టి తెల్లవారితే మగవాడు వాకిలి చిమ్ముతాడు. ఆటుతర్వాత ఇంటికి కావలసిన నీరంతా బీబీ స్నానోదకములు సహా మగవాడు మోస్తాడు. అంగడిసామానులు బీబీకి చీరలు రవికెలు యావత్తు మగవాడే తెస్తాడు. పరిస్థితు లిట్లుండగా మీ కెందుకట్లు వాస్తవమునకు విరుద్ధమైన అభిప్రాయము కలిగినది చెప్పండి."

అంతటితో కూలాడు పాపన్న. పగిలిన మోటారు టైరువలె చప్పున లోగిపోయ్యాడు. హీనస్వరముతో "నిజమేనా, నిజమేనా" అన్నాడు. అప్పుడని స్ఫుటముగా నొక్కిచెప్పాడు రామారావు. పాపమా దినమునుండి పాపన్న మహమ్మదీయులు మగధీరులనేమాట మానివేశాడు.

ఆడువారిని, ముఖ్యముగ భార్యలను కట్టుదిట్టాలు చేయు విషయమునుగురించి పాపన్న పలుమారు వల్లిస్తుండేది: "ఏమిటయ్యా, మగవాడంటే ఆడవాళ్ళని యడుగుల చప్పుడు విన్నంగానే నిలువున గజగజ వణకవద్దటయ్యా, ఇది చాల కష్టతరమైన పని యనుకున్నారేమో, కాదు. అతి సులభము, ఇదిగో యీ కిటుకు చూడండి - ఇది చెలిబోటుల వేలు మందున్నది. స్త్రీల విషయములో లాలన తాడనమని రెండు చెప్తారు - భార్యలను గూర్చి లాలన తలపెట్టకూడదు.

తాడనశాస్త్రవిశేషము - ముఖ్యముగ నీ యుపయోగకారి, దినమునను మూడుకాలములు నిర్ణయించుకొని ప్రాతఃకాలము, మధ్యాహ్నము, సాయంకాలము ముమ్మారు తాడన చేయవలెను. ఇందుపేక్ష చేయకూడదు. నిర్ణయకాలమున నియమము తప్పక దండము ప్రయోగించవలెను. లఘు ప్రహారణము లుపయోగము లేదు. దయాదాక్షిణ్య మనక ఘాటుగా మోదవలెను. ఈ పద్ధతిని మన ముల్లంఘించక ఔషధములు రోగికి సకాలమం దిచ్చినంత క్రమముగా చేయవలెను. అట్లు చేసినయెడల భార్య

అణగిమణగి మనమేదైన చెపితే తక్షణము సోల్జరు కమాండరు ఉత్తరువు ప్రకారము నడచుకొనునట్లు నడచుకొందురు. భార్యలు మాకు మాట్లాడక మనము లేవమంటే లేవవలె, కూర్చోమంటే కూర్చోవలె, అప్పుడుకదా మనము మీసము మీద చెయి పెట్టి మగధీరులమనిపించుకొనేది-ఈ సుఖము కఱ్ఱప్రయోగమునకు ఫలితము"

... ... ...

పాపన్న భార్య సీతమ్మ. ఆమె మంచి ఒడ్డు పొడుగు, భారీ మనిషి, సుమారయిదున్నర అడుగుల పొడుగుంటుంది. ఇరుగుపొరుగు వారిని విచారిస్తే ఆమె గయ్యాళి అన్నారు. పొట్టి పాపన్న పొడుగు సీతమ్మను ఎలా ఎంచిపెట్టాడని మా కందరికి అతి కుతూహలముగుండేది. ఇట్లుండగా నొకరోజు రామరావు పరుగున వచ్చి ''రావయ్యా పాపన్న సీతమ్మకు ప్రహారణం చేస్తున్నాడు, గోలగా ఉన్నాది మగధీరత్వం జరుగుతున్నాది, రా చూతాం'' అన్నాడు, అంతట నేనున్నూ పాపన్న ఇంటివద్దకు పరుగిడాను.

అక్కడ వీధిలో పాపన్న యింటిముందర నలుగురయిదుగురు నిలిచి చూస్తుండినారు. మేమున్నూ వారిలో చేరాము. పక్కింటి సుబ్బయ్య తన ఇంటికప్పు పెంకులపైన కూర్చొని వంగిచూస్తుండినాడు. పాపన్న ఇంటి ఆవరణంలో ఏవో జంతువులో మనుష్యులో పరుగిడినట్లు దబదబ యడుగుల చప్పుడు వినవచ్చింది.

అది ఆగి పాపన్న కంఠము బిగ్గరగా "చావు ముండా, పాడుముండా చంపేస్తా"నని వినవచ్చింది. కఱ్ఱ పెట్లశబ్దము తపతపమని మా చెవుల సోకింది. మేమంతా "అయ్యో, పాపము! సీతమ్మను చావ కొడుతున్నాడే, ఎట్లా తప్పిస్తామని" యోచనలో యుండగా తలుపు దభాలున తెరిచి పాపన్న వీధిలోనికొక్క గంతువేశాడు. మమ్ము గమనించక, ధోవతి చెంగు యూడి వీధిని చిమ్ముచుండినది పాటించక బిరబిర నడిచి పాపన్న వీధి చివరకు వెళ్ళిపోయెను.

మాకేమి బోధపడలేదు. రామరావు సుబ్బయ్యను చూచి ''ఇంటికప్పుపై నుండే గంధర్వుడా దయచేయుంచి భూమిమీదికి దిగి విషయమేమిటో చెప్పవయ్యా" అనెను. సుబ్బయ్య నవ్వుకుంటూ మెల్లిగా దిగి వీధిలోనికి వచ్చెను. సుబ్బయ్య ఇట్లు వర్ణించెను: "ఇది మీకేదో క్రొత్తవింతగా నున్నది. నాకిది నిత్యము చూచే ప్రదర్శనమే-పాపన్న ప్రతిదినము నాలుగుఘంటలప్పుడు తోటలో పనిచేస్తుంటాడు. ఈ దినము పాటికట్టన కూర్చొని 'ఓయి' అని కేక వేశాడు. సీతమ్మ పలుకలేదు. నాలుగయిదుసారులు పాపన్న 'ఓయి, ఓయని' ఒక్కొక్క పిలుపునకు స్థాయి ఎక్కించుకొంటూ పిలిచాడు. పద్దనూని కొచ్చేటప్పటికి సీతమ్మ "ఏమిటా" యని ప్రత్యుత్తరమిచ్చింది. ఇక తూచా తప్పకుండా పూసగ్రుచ్చినట్లు వారికి జరిగిన సంభాషణ వృత్తాంతము చెప్తాను వినండి."

"ఇన్నిమారులు పిలిస్తే నీకేమి వినపడలేదా, నీకేమి చెవుడా-పాకి చిమ్మడానికి చీపురు కావలె తక్షణం తీసుకరా'' అన్నాడు పాపన్న.

''ఈ మునిగిపోయ్యే పనికా అన్ని అరుపులు-నేను పచ్చడి నూరుతున్నాను. చేయి తీరలేదు. ఇక్కడ తలుపుచాటున పెట్టున్నాను చీపురు నీవే తీసుకో'' అనింది సీతమ్మ.

''ఏమిటి, ఒడలు తెలిసి మాట్లాడుతున్నావా, తక్షణం తీసుకొనిరా-నాకా నీవు పనిచెప్తావు. నేనేమి నీ బానిసననుకున్నావా, నీ దాసుడననుకున్నావా-ఆడముండ మగవాడికి పనిచెప్పడమా, నే నెవరననుకున్నావు'' అని గర్జించాడు పాపన్న.

"వెత్తిముండాకొడుక"ని ప్రత్యుత్తరమిచ్చింది సీతమ్మ, అంతట పట్టలేని ఆగ్రహమున "నాతో సవాలా జవాబా" యని లేచి కఱ్ఱ చేతపట్టాడు. లగ్డహస్తం మూం యమదూతం భావయాతన్నే రకములో ''ఒళ్ళు విరగకొడతాను, చంపేస్తా''నంటూ రోషావేశమున ఇంట్లో జొరబడ్డాడు. మరల అతిశీఘ్రముగ కఱ్ఱ లేకుండా బయటికి వచ్చాడు, వెనుకనే సీతమ్మ కనుపడ్డది. ఇంద్రజాలమువలె పాపన్న కఱ్ఱ చేతులుమారి ఇపుడు సీతమ్మ చేతులో వుండినది. పాపన్న తిరిగిచూచి పరుగెత్తాడు. సీతమ్మ వెంట తరిమింది. ముందు పాపన్న వెనుక సీతమ్మ-యీ వరుసన యింటిచుట్టూ మూడుప్రదక్షిణాలు చేశారు. మూడవప్రదక్షిణంలో పాపన్న సీతమ్మచేతిలో చిక్కాడు. సీతమ్మ పాపన్నకు వర్షము పడ్డట్లు వీపు కఱ్ఱతో దబదబ వడించింది. నేను వాళ్ళయింట్లోకి దుమికైనా పాపన్నను తప్పిస్తామనుకుంటుండగా ఎట్లో పట్టు వదిలించుకొని వీధిలోకాయన పారిపోయ్యాడన్నాడు సుబ్బయ్య.

"ఏమాశ్చర్యము! పాపన్న చరిత్ర తల్లక్రిందుల వ్యవహారమయిందే'' అన్నాను నేను.

"ఔరా! మగధీరుడా!'' అని ముక్కుమీద వేలు పెట్టుకున్నాడు రామరావు.